# మంటూరు లాంచీ ప్రమాదం-ప్రజలపట్ల పాలకుల సుదీర్ఘకాలపు ఘోర నిర్లక్ష్య విధానాల ఫలితమే

## ప్రమాదానికి స్పందించి కదలిన ప్రజలకు జేజేలు

**- రైతుకూలీసంఘం(ఆం.ప్ర), ఏజెన్సీ గిరిజన సంఘం**

***15వ తేదీ సా॥6 గంటలకు దేవీపట్నం మండలం మంటూరువద్ద జరిగిన లాంచీ ప్రమాదం ఒక ఘోర దుర్ఘటన. దీనిలో కొండమొదలు, తాడివాడ, తాళ్ళూరు కచ్చులూరు, గొందూరు, పెదభీంపల్లి గ్రామాలకు చెందిన 19 మంది స్త్రీలు, పిల్లలు, పురుషులు, మరణించారు. ఈ ఘోరఘటనలో మరణించిన వారందరికీ జోహార్లు తెల్పుతున్నాము. వారి కుటుంబాలకు, ఆయా గ్రామాల ప్రజలకు మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాం. ఆ ఘోర దుర్ఘటన క్రమం ఇలా వుంది.***

అపుడు సమయం 15-5-18 సాయంత్రం 4.00 గంటలు. దేవీపట్నం గోదావరి రేవులో లాంచి ప్రయాణం కోసం ఎదురుచూస్తున్న ఎగువ గ్రామాల ప్రయాణీకులు అక్కడ లాంచీ ఎపుడు బయల్దేరుతుందా అని చూస్తున్నారు. వారిలో 'ప్రజల ముంగిట పాలన' అంటూ పాలకులు చెప్పేవి అబద్ధాలని నిరూపిస్తూ, ఏ చిన్న సంతకం కావాలన్నా గోదావరిలో ప్రయాణించి, ఆటోలో ఎక్కి, ఆఫీసులకు వెళ్ళి, పడిగాపులు పడి, సంతకాలు చేయించుకొని తిరిగి వస్తున్నవారు, వారానికి సరిపడా ఉప్పు, పప్పులు, కోడిగుడ్లు, మందులు కొనుక్కొని వచ్చేవారు, ఇంటి రిపేర్ల నిమిత్తం 6 బస్తాల సిమెంటుతో వచ్చినవారు, ఇలా రకరకాల అవసరాలకోసం వచ్చిన వారంతా సుమారు 30-40 మంది రేవులో వున్నారు. వారంతా లాంచీ ఓనర్, డ్రైవర్ అయిన ఖాజాను తొందరచేసి బయల్దేరదీయించారు. వరదలు, వానలలో, ఏ కాలంలోనైనా బయటి ప్రపంచాన్ని చూడటానికి ఆ గ్రామాలవారికి ఆ లాంచీనే ఆధారం. బయల్దేరిన లాంచీ మంటూరు గ్రామం చేరేటప్పటికి గాలిదుమారం, వర్షం ప్రారంభం అయింది. వర్షపు జల్లు పడుతోందని సుమారు 20 మంది ఉన్న లాంచీ ముందు కాబిన్ కిటికీలు వేసేశారు. వెనకభాగపు క్యాబిన్ తలుపులు ఒక పక్క వేయలేదు. గాలికి ఎదురువెళ్ళినా, కొద్దిసేపు నిలిపివుంచినా, ప్రమాదం జరిగేది కాదు. కానీ ఎపుడు అయితే అవతలి గట్టునవున్న వాడపల్లి గ్రామం ఒడ్డుకు చేరటానికి లాంచీ గోదావరికి అడ్డుగా తిరిగిందో హటాత్తుగా వచ్చిన తీవ్ర సుడిగాలి ఉధృతికి లాంచీ బోల్తా పడింది. వెంటనే వెనుక భాగంలో వున్న యువకులు, స్త్రీలు, పిల్లలు గోదావరిలోకి దూకగలిగారు. కానీ ముందు కాబిన్‌లో తలుపులు మూసుకొని వున్నందున దానిలోని వారు వెంటనే బయటకు రాలేక పోయారు. ఈ విషాద ఘటనలో మరణించిన వారందరు ఈ కాబిన్‌లో వున్న వాళ్ళే. బయటకు దూకినవారు సుమారు 17, 18 మంది వుంటారు. వీరిలో 13 మంది పురుషులు, నలుగురు స్త్రీలు. వీరిలో ఈతవచ్చిన వారు ఆ గాలిలో, వర్షంలో ఈదుకుంటూ ఏదో ఒడ్డుకు చేరుకున్నారు. ఈతరాని పిల్లలు, స్త్రీలు నీళ్ళలో తేలుతున్న లైఫ్‌జాకెట్ల వంటివి పట్టుకొని మునగకుండా ఈదుతున్నారు. ఈలోగా మంటూరు గ్రామంనుంచి వచ్చిన యువకులు అందర్నీ ఒడ్డుకు చేర్చారు. ఈ ఘోర దుర్ఘటనలో మరణించినవారుగా ఇప్పటికి లెక్కతేలిన వారిలో 11 మంది మహిళలు, నలుగురు పిల్లలు, నలుగురు పురుషులు వున్నారు. వీరిలో 17 మంది దేవీపట్నం మండలానికి చెందినవారు కాగా, చుట్టరికంగా వచ్చిన రంపచోడవరం మండలం పెదభీంపల్లి వారు ఇద్దరు, దేవీపట్నం మండలం కె.గొందూరునుండి 8 మంది, కచ్చులూరినుండి ఇద్దరు, తాళ్ళూరు నుండి నలుగురు, కొండమొదలు నుంచి ఒకరు, తాడివాడ నుండి ఇద్దరు మొత్తం 17 మంది.

**దుర్ఘటన జరిగిన వెంటనే కదిలిన మంటూరు, ఇతర గ్రామాల ప్రజలు**

ప్రమాదం జరిగిన వెంటనే పక్కనేవున్న మంటూరు గ్రామస్తులకు ఈ విషయం తెలిసిపోయింది. తీవ్రమైన గాలులు, కుంభవృష్టి మూలంగా సహాయక చర్యలు సాధ్యంకావడంలేదన్న వార్తలు బయట టీవీలలో వస్తున్న సమయంలో మంటూరు ప్రజలు ఆ వర్షంలోనే బోట్లు, పడవలతో ప్రమాదస్థలానికి చేరుకొని, ఈదుతున్న వారినందరినీ రక్షించారు. అప్పటికే లాంచీ మునిగిపోయింది. పైకివస్తున్న డీజిల్ గుర్తునుబట్టి లాంచీని తాళ్ళతో పైకిలాగాలని ప్రయత్నించారు. కానీ సాధ్యం కాలేదు. కొందరు యువకులు, విద్యార్థులు, గిరిజనసంఘ నాయకురాలు, సర్పంచి అయిన చెదల అరుణ తదితరులు దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌కు, టీవీ వాళ్ళకు ప్రమాదం గురించి తెలిపారు. అధికారులు, పోలీసులు ప్రమాదం జరిగిన చోటుకి వచ్చేసరికి చీకటి పడిపోయింది. ఆ రాత్రి కూడా మంటూరు గ్రామప్రజలే గోదావరిలో వెదకటానికి, రేవువద్దకు వెళ్ళటానికి వీలుగా దారి ఏర్పాటుచేసి, కరెంట్ లైట్లు అమర్చారు. ఆ రాత్రికి సుమారు 25 మంది రెవెన్యూ సిబ్బందికి గ్రామసర్పంచి ఆధ్వర్యంలో వంటలుచేసి భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రజలపట్ల స్పందించే ఈ లక్షణం, గిరిజనోద్యమ పోరాటాల క్రమంలో అభివృద్ధిచెందినది. నాటి 1986 గోదావరి వరదల సందర్భంనుండి నేటి వరకూ సంఘం, ప్రజలు ఆపదలో వున్న వారిని కాపాడటంలో ముందుభాగానే వున్నారు. ఇది సంఘం నేర్పించిన చైతన్యం. దానిలో భాగంగా ఏజెన్సీ గిరిజన సంఘ నాయకత్వాన వున్న కొండమొదలు, మంటూరు పంచాయితీల సర్పంచులు, సంఘ కార్యకర్తలు

ప్రజలను కదిలించారు. వార్త తెలిసిన వెంటనే కొండమొదలు నుండి కొందరు యువకులు, అద్దరినున్న వాడపల్లి చేరుకున్నారు. పోలవరం ప్రాంత ఏజెన్సీ గిరిజన సంఘ నాయకులు ఆ రాత్రికే వాడపల్లి ప్రాంతానికి చేరుకుని సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పరిస్థితి ఇది కాగా ప్రభుత్వం సహాయక చర్యలు ప్రారంభించేవరకు మంటూరు గ్రామస్థులకు కూడా పడవ మునక విషయం తెలియదని వార్తా కథనాలను టీవీలు ప్రసారం చేశాయి. ఇది సరైన సమాచారం కాకపోగా, ప్రజలు నిర్వహించిన పాత్రను గుర్తించే లక్షణం లేకపోవడమే.

**సహాయక చర్యల పట్ల ప్రజల ఆగ్రహం – నిరసన**

మర్నాడు తెల్లవారిన తర్వాత ప్రభుత్వ జాతీయ విపత్తు సహాయక బృందాలు మునిగిన లాంచీని వెతికి తీయటానికి కొన్ని ప్రయత్నాలు చేశాయి. కాని అవన్నీ విఫలం అయినపుడు స్థానిక ప్రజలు జోక్యం చేసుకొని ఆ లాంచీని బయటకు తీయడానికి కావలసిన పద్ధతులను జాతీయ విపత్తుల సహాయక సభ్యులకు తెలియజేశారు. స్థానిక ప్రజల ఆలోచన, అనుభవాన్ని స్వీకరించి పరస్పర సహకారంతో లాంచీని ఒడ్డుకు లాగారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చేవరకూ సాగింది. చంద్రబాబునాయుడు, ఆయన మంత్రులు, అధికారులు అక్కడ ప్రజల నిరసనను ఎదుర్కొన్నారు. రోడ్డురవాణా సౌకర్యాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఏజన్సీ ప్రజలపట్ల ప్రభుత్వం చూపుతున్న ఇంత ఘోరమైన నిర్లక్ష్యాన్ని ప్రజలు దుయ్యపట్టారు. 'పక్కనే పోలవరం ప్రాజెక్టు దగ్గర భారీయంత్రాలతో గోదావరికే అడ్డుకట్టలు వేస్తున్నా, నిన్న సాయంత్రం 6 గంటలకు మునిగిన లాంచీని తీయడానికి ఈ మధ్యాహ్నం 12 గంటల దాకా సమయం మీకు ఎందుకు పట్టింది? అంతసేపు శవాల్ని నీళ్ళలో ఎందుకు కుళ్ళనివ్వాల'ని ప్రజలు ప్రశ్నించారు. రైతుకూలీసంఘ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎస్.ఝాన్సి నాయకత్వాన సహాయ కార్యదర్శి డి.వర్మ, రాష్ట్ర నాయకులు ఎం.ఎస్.నాగరాజు, కుంజం రామారావు, ఇల్లా రామిరెడ్డి, కొండమొదలు సర్పంచి వేట్ల విజయ, మంటూరు సర్పంచి చెదల అరుణ, గిరిజన సంఘ నాయకులు చెదల వీరారెడ్డి, వంజం జోగారావు, నవయువ సమాఖ్య నాయకుడు బాషా, పిడిఎస్ఓ నాయకుడు సురేష్ తదితరులు ఘటనాస్థలంలోనే వుండి బాధిత కుటుంబాలను ఓదార్చారు.

వేలకోట్ల రూపాయల ప్రజా ధనంతో పోలవరం ప్రాజెక్టు కడుతున్నట్లు చెపుతున్న ప్రభుత్వం, ఈ ప్రాజెక్టు వెనకాల దశాబ్దాల తరబడి ఏజన్సీ ప్రజలను నిర్లక్ష్యానికి గురిచేస్తున్నట్లుగా ఈ ఘటన తేటతెల్లం చేసింది. ఏజెన్సీ ప్రజలపట్ల ఈ నిర్లక్ష్యం బాధ్యతారహిత వైఖరే ప్రాజెక్టు నిర్వాసితుల విషయంలో కూడా కన్పిస్తున్నది. ప్రభుత్వం తన నిర్లక్ష్యవైఖరిని కప్పిపుచ్చుకోవడానికి లాంచి, దాని సామర్థ్యం అనుమతుల గురించి మీడియాద్వారా పండిత చర్చ జరిపించుతోంది. ఆ లాంచి సామర్థ్యం, అనుమతులు గురించి ఏమిటో కానీ ఇన్ని ఏళ్ళూ వానల్లో వరదలలో ఏజెన్సీ ప్రజలకు ఆ లాంచీతప్ప గతిలేని పరిస్థితి ఎందుకు ఏర్పడిందో దాన్ని కప్పిపుచ్చుతున్నారు. గోదావరిపై ఎగువకు, దిగువకు ప్రయాణించే ప్రతిబోటు, లాంచి విధిగా దేవీపట్నం పోలీసుస్టేషన్‌కి వెళ్ళి అధికారులకు చెప్పి వెళ్ళాలి. కానీ సరంగు ఖాజా నిర్లక్ష్యం గురించి ఎక్కువగా మాట్లాడుతూ మౌలిక కారణాలను మరుగుపరచ ప్రయత్నిస్తున్నారు. వందబస్తాల సిమెంటు లోడు అనీ, అనుమతికి మించిన ప్రయాణం చేయిస్తు న్నాడని చెప్పి అతనిని మాత్రమే మొత్తానికి బలిపశువును చేస్తున్నారని ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) భావిస్తున్నాయి. ఇవన్నీ దూరంగా వున్నవారికి తప్ప బాధిత ప్రజలుకు అసలు కారణాలు తెలుసు. వారు అంత బాధలో కూడా ముఖ్యమంత్రిని ప్రశ్నించగలిగారు. ఆవేదన, ఆక్రోశాలను వెళ్ళగక్కారు. భద్రతా చర్యల గురించి మాట్లాడుతున్న వారు పోలీసు యంత్రాంగం అసలు దృష్టి ఎక్కడ వుందో గమనించాలి, దానిలో భాగంగా లాంచీ నిర్వాహకుల నిర్లక్ష్యవైఖరిని ఖండించాలి. ఇలాంటి పరిస్థితులు రాకుండా వుండాలని ప్రజలు తమ శ్రమదానంతో కొండమొదలు నుంచి మంటూరు వరకు వేసుకున్న రోడ్లని అభివృద్ధి చేయటానికి ప్రభుత్వం పూనుకోలేదు. అదేవిధంగా మంటూరు, దేవీపట్నం, పక్కారోడ్డుకోసం ఎన్ని ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ఆపద సమయాలలో అంటే (ప్రసవాలు, పాముకాట్లు వంటివి జరిగినపుడు) ఆసుపత్రికి తరలించే మార్గంలేక ఎందరో చనిపోతున్న పరిస్థితి వుంది. కనీస సౌకర్యాల కల్పనలో ఇలా ఘోర నిర్లక్ష్యాలు ప్రదర్శిస్తున్న ప్రభుత్వం ఇపుడు తూతూ మంత్రంగా ఎక్స్‌గ్రేషియాలు ఇస్తున్నట్లు ప్రకటిస్తోంది. ప్రభుత్వ ఈ నిర్లక్ష్యవైఖరికి వ్యతిరేకంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యం, రవాణా సౌకర్యాలకోసం పోరాడాల్సిన కర్తవ్యం మనముందున్నదని ఈ విషాద ఘటన తెలియజేస్తున్నది.

**17-5-18**

ooooo

1